సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



రాత..దాటొద్దు గీత

ఎన్నికల బరిలో ఉన్న నేతలు సోషల్ మీడియాపై దృష్టి సారించారు. ఇష్టానుసారంగా పోస్టులు పెట్టే వారిపై పోలీసు యంత్రాంగం సైతం నిఘా ఉంచింది. IIలో▸

నేడు డయల్‌యువర్ డీఎం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ డిపో పరిధిలో మంగళవారం డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు డీఎం రవీంద్రనాథ్ తెలిపా రు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహిం చే కార్యక్రమంలో ఆర్టీసీ బస్సుల సమయం, నూతన రూట్స్, ఇతర సమస్యలపై ప్రయాణికు లు సలహాలు సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఇందుకోసం 9959226004 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.4 /21.1

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. పగలు ఎండగా, రాత్రి చల్లగా ఉంటుంది. చలి ప్రభావం స్వల్పంగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యం తగదు

- మంచిర్యాల రిటర్నింగ్ అధికారి రాములు



మాట్లాడుతున్న రాములు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బందికి కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా సమయపాలన పాటించాలని మంచిర్యాల రిటర్నింగ్ అధికారి(ఆర్డీవో) రాములు అన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సోమవారం మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన మాస్టర్ ట్రైనర్స్, సెక్టర్ అధికారులకు పోలింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

బీసీ సంఘాల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

పాతమంచిర్యాల: బీసీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని సోమవారం నిరసన తెలిపారు. బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ 76 ఏళ్ల ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీ బీసీల సమస్యలు పరిష్కరించలేదన్నారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని కేంద్ర మంత్రి అమిషా ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి రూ.2 లక్షల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలన్నారు. నిరసనలో బీసీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు గజెల్లి వెంకటయ్య, నాయకులు బోడెంకి మహేశ్, చంద్రగిరి చంద్రమౌళి, ఆరెందుల రాజేశం, కీర్తి భిక్షపతి, మల్లయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి వాచ్ ఉమెన్ తొలగింపు

చెన్నూర్: చెన్నూర్ ఎస్సీ బాలికల హాస్టల్‌లో వాచ్ ఉమెన్ నూతి లక్ష్మిని ఎస్సీ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. లక్ష్మీ బీఆర్ఎస్ పార్టీ సపోర్టుగా మంచిర్యాల నియోజకవర్గంలో పలు గ్రూపుల్లో వీడియోలను పోస్ట్ చేయడంతో అవి వైరల్ అయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల్లో పార్టీలకు మద్దతుగా ప్రచారం చేయడం, వీడియోలు పోస్ట్ చేయద్దని ఎన్నికల సంఘం హెచ్చరించింది. అయినా లక్ష్మి నిబంధనలకు విరుద్ధంగా బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వీడియోలు పోస్ట్ చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగించారు.

నిర్భయంగా ఓటేయాలి

- మంచిర్యాల డీసీపీ రాంనాథ్ కేకన్



చెన్నూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న బలగాలు

చెన్నూర్: అసెంబ్లీ ఎన్నికలలో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. చెన్నూర్ పట్టణంలోని అయ్యప్ప ఆలయం నుంచి కొత్త బస్టాండ్ మీదుగా కొత్తగూడెం, అంబేద్కర్ చౌరస్తా, గాంధీచౌక్ నుంచి పోలీసు స్టేషన్ వరకు సోమవారం పోలీసులు, ప్రత్యేక బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ మాట్లాడారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు పోలీసు బలగాలు పకడ్బందీగా పనిచేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ మోహన్, ఆర్వో సిడాం దత్తు, చెన్నూర్ సీఐ వాసుదేవరావు, చెన్నూర్‌రూరల్ సీఐ విద్యాసాగర్, జైపూర్ సబ్ డివిజనల్ సీఐలు, ఎస్సైలు, రెవెన్యూ అధికారులు, సివిల్, సీఆర్‌పీఎఫ్, టీఎస్ఎస్‌పీ పోలీసులు పాల్గొన్నారు.

అన్నీ సమస్యాత్మకమే!

- ఐదు నియోజకవర్గాలపై ఈసీ ప్రత్యేక దృష్టి
- మంచిర్యాల జిల్లాలో మూడు
- కుమురంభీం జిల్లాలో రెండు..
- ఈ నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం



బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేదుకు కేంద్ర ఎన్నికల కమిషన్(సీఈసీ)చర్యలు చేపట్టింది. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సమస్యాత్మక నియోజకవర్గాలను ఈసీ సోమవారం ప్రకటించింది. ఈ జాబితాలో మంచిర్యా ల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, సిర్పూర్(టి), ఆసిఫాబాద్ నియోజకవర్గాలు ఉన్నాయి.

ఇలా గుర్తింపు..

గతంలో ఆయా నియోజకవర్గాల్లో జరిగిన ఘటనలు, ఎన్నికల నిర్వహణకు ఎదురైన ఇబ్బందుల ఆధారంగా ఈసీ సమస్యాత్మక నియోజకవర్గాలుగా ప్రకటించింది. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది చేరుకోవడానికి ఎదురయ్యే ఇబ్బందులు, ఇంటర్‌నెట్, సెల్‌ఫోన్ సిగ్నల్ లేని గ్రామాలు, దట్టమైన అటవీ ప్రాంతం, ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రానికి తరలించడానికి ఎదురయ్యే ఇబ్బందులు, మావోయిస్టు ప్రభావం తదితర అంశాలను కూడా ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకుని ఐదు నియోజకవర్గాలను సమస్యాత్మకంగా ప్రకటించింది.



4 గంటల వరకే పోలింగ్..

సాధారణ నియోజకవర్గాల్లో పోలింగ్ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. సమస్యాత్మక నియోజకవర్గాల్లో మాత్రం గంట ముందే పోలింగ్ ముగుస్తుంది. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ నిర్వహిస్తారు.

చీకటి పడకముందే స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు..

సమస్యాత్మక నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను చీకటి పడకముందే స్ట్రాంగ్ రూంలకు తరలించేలా ఈసీ చర్యలు చేపట్టింది. ఈమేరకు జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు ప్రణాళిక రూపొందించాలని ఈసీ స్పష్టం చేసింది.

ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి...

మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జి ల్లాలు ఒకప్పుడు మావోయిస్టు ప్రభావిత జి ల్లాలు. రెండు దశాబ్దాల క్రితం చలా గ్రామాల్లో మావోయిస్టుల ప్రభావం ఉండేది. ప్రస్తు తం మావోయిస్టుల ప్రాబల్యం లేకపోయినా, ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే ఈసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మావోయిస్టు ప్రభావిత గ్రా మాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల్లోని అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గిరిజన పల్లెలు, మారుమూల గ్రామాలు సమస్యాత్మక గ్రా మాలుగా గుర్తించారు. ఆసిఫాబాద్, సిర్పూర్(టి) నియోజకవర్గాలకు సరిహద్దున మహా రాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌తోపాటు రెండు నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాలు కూడా సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. జిల్లాలోని చాలా గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం, దట్టమైన అటవీ ప్రాంతం ఉండడంతో సమస్యాత్మకంగా గుర్తించినట్లు తెలిసింది.

మంచిర్యాల జిల్లాలో....

మావోయిస్టు ప్రభావిత కేంద్రాలు	48
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు	82
సెల్ సిగ్నల్‌లేని కేంద్రాలు	19
మొత్తం పోలింగ్ కేంద్రాలు	726

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా..

మావోయిస్టు ప్రభావిత కేంద్రాలు	73
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు	92
సెల్ సిగ్నల్ లేని కేంద్రాలు	48
మొత్తం పోలింగ్ కేంద్రాలు	597

ఓటు నమోదుకు నేడే ఆఖరు..

- మార్పులు చేర్పులకు చివరి అవకాశం



మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఎన్నికల సంఘం ఓటుహక్కు కల్పిస్తోంది. ఓటరుగా నమోదుకు మంగళవారం వరకు గడువు ఇచ్చింది. నూతన ఓటరు నమోదుతో పాటు.. వేరే ప్రాంతానికి ఓటు బదిలీ, వివరాల దిద్దుబాటుకు సైతం మంగళవారంతో గడువు ముగియనుంది. అక్టోబర్ 1 వరకు నమోదు అయిన తుది ఓటరు జాబితా ఈ నెల 4న ప్రకటించింది. ఇంకా చాలా మంది ఓటుహక్కు నమోదు చేసుకోలేదు..18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లాలో అధికారులు పెద్దఎత్తున ప్రచారం చేశారు. మారుమూల గ్రామాల్లో కళాబృందాల ద్వారా చైతన్యం చేపట్టారు. ఈ నెల 30 వరకు 22,023 దరఖాస్తులు వచ్చాయి. గడిచిన నెల రోజుల వ్యవధిలో పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఇందులో మంచిర్యాల నుంచి దరఖాస్తులు పోటెత్తాయి. మంగళవారం 2 వేల వరకు దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆన్‌లైన్‌లోనే..

కొత్తగా నమోదు చేసుకునే వారు ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. గతంలో నమోదుకు మార్పులు, చేర్పులకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. ప్రస్తుతం అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో ఉండడంతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మీసేవ కేంద్రాలు, మొబైల్ ప్రత్యేక ఓటరు యాప్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం తొలగింపునకు అవకాశం లేదు. ఓటరు నమోదు అయిందా లేదా, మార్పులు చేర్పులు జరిగాయా లేదా అనే వివరాలకు 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్‌చేసి తెలుసుకోవచ్చు.

జిల్లాలో ఇప్పటి వరకు ఓటర్ల వివరాలు నియోజకవర్గాలవారీగా..

నియోజకవర్గం	ఓటర్లు	సర్వీస్ ఓటర్లు	కొత్త దరఖాస్తులు
మంచిర్యాల	2,64,186	323	12,253
చెన్నూర్	1,84,117	133	5,201
బెల్లంపల్లి	1,69,598	161	4,569
మొత్తం	6,17,901	627	22,023

ఉన్నత విద్య భారం



చెన్నూర్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఎజెండాలో పాల్గొన్న యువకులు

ప్రజా ఎజెండా

- చెన్నూర్‌లో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలి
- స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం పూర్తిచేయాలి
- ఐటీఐ, దూరవిద్య కేంద్రాలు నెలకొల్పాలి
- 'సాక్షి' ప్రజా ఎజెండాలో యువకుల డిమాండ్

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలోని విద్యార్థులకు ఉన్నత విద్య భారంగా మారింది. పోస్టు గ్రాడ్యుయేషన్ చేయడానికి జిల్లా కేంద్రం లేదా పొరుగున ఉన్న పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు వెళ్లాల్సి వస్తోంది. చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో ఉన్నత విద్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్య దరిచేరుతుందని పలువురు విద్యార్థులు, యువకులు అభిప్రాయపడ్డారు. డిగ్రీలు, పీజీలు చేసిన నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంచేలా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం పూర్తి చేయాలని కోరారు. కొత్తగా ఏర్పడే ప్రభుత్వం చెన్నూర్‌లో ఐటీఐ కళాశాల, దూర విద్య కేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కావాలి..



స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లేక నిరుద్యోగ యువత పట్టణాలకు వెళ్లి ప్రైవేటుగా కోచింగ్ తీసుకుంటున్నారు. ఇందుకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభిస్తే ఉద్యోగావకాశాల కోసం ప్రిపేర్ అయ్యేవారికి ఉపయోగకరంగా ఉంటుంది.

– చెన్నూరి నవీన్‌కుమార్, నిరుద్యోగి

పీజీ కళాశాల ఏర్పాటు చేయాలి..



చెన్నూర్‌లో పీజీ కళాశాల లేక పేద విద్యార్థులు డిగ్రీతోనే చదువు మానేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రంలో యూనివర్సిటీ స్టడీ సెంటర్ లేదా పీజీ కళాశాల ఏర్పాటు చేస్తే కోటపల్లి, వేమనపల్లి, భీమారం మండలాల నిరుపేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. ఈ దిశగా కొత్తగా ఏర్పడే ప్రభుత్వం కృషి చేయాలి.

– తగరం నరేశ్, పీజీ విద్యార్థి

ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలి..



చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు కానుంది. చెన్నూర్‌లో ఐటీఐ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత విద్యార్థులు సాంకేతిక విద్య అందుబాటులోకి వస్తుంది. చెన్నూర్‌లో ఐటీఐ లేక విద్యార్థులు మంచిర్యాలకు వెళ్లాల్సి వస్తోంది. పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోంది. – నవీన్, నిరుద్యోగి

దూరవిద్య కేంద్రం ఏర్పాటు చేయాలి..



దూరవిద్య కేంద్రం లేక గ్రామీణులు, మధ్యలో చదువు మానేసిన వారు ఇబ్బంది పడుతున్నారు. ఓపెన్ యూనివర్సిటీ పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొత్త ప్రభుత్వం చెన్నూర్‌లో దూరవిద్య కేంద్రం ఏర్పాటు చేయాలి. – అంబాల నవీన్, నిరుద్యోగి

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సంతోష్, అధికారులు

- ఎన్నికలకు కట్టుదిట్టమైన చర్యలు
- ఎన్నికల సీనియర్ డిప్యూటీ కమిషనర్ నితేశ్ వ్యాస్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్ నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలని, నామినేషన్ల స్వీకరణలో సమయపాలన పాటించాలని ఎన్నికల సీనియర్ డిప్యూటీ కమిషనర్ నితేష్ వ్యాస్ అన్నారు. ఢిల్లీ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, ఎన్నికల విభాగం అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలని, రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించాలని తెలిపారు. నామినేషన్లలో తప్పులు ఉంటే వెంటనే సంబంధిత అభ్యర్థికి సమాచారం అందించాలన్నారు. పోటీచేసే ప్రతీ అభ్యర్థికి తప్పనిసరిగా ఓటరు జాబితా వివరాలు అందించాలని సూచించారు. స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఈవీఎంల భద్రతకు చర్యలు

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్, పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలలో అవసరమైన వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈవీఎంలను తరలించే అధికారులకు భద్రత కల్పించాలని సూచించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల 2వ ర్యాండమైజేషన్ అభ్యర్థుల సమక్షంలో చేపట్టాలని తెలిపారు. అభ్యర్థులు అధికంగా ఉంటే సప్లమెంటరీ ర్యాండమైజేషన్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల జాబితా అభ్యర్థులకు, రాజకీయ పార్టీలకు అందజేయాలని సూచించారు. ప్రతీ నియోజకవర్గం పరిధిలో మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయాలని, పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక వసతులు కల్పించాలని వెల్లడించారు. పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

తనిఖీలు నిష్పక్షపాతంగా చేయాలి..

ఎన్నికల తనిఖీల్లో సీజ్ చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ ప్రతీరోజు వచ్చే అప్పీల్‌పై చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. రూ.10 లక్షల కంటే అధికంగా సీజ్ చేస్తే ఐటి అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. నవంబర్ 3 నుంచి ఎన్నికల పరిశీలకుల క్షేత్ర పర్యటన ఉంటుందని, అందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీల సమయంలో నిస్పక్షపాతంగా వ్యవహరించాని సూచించారు. ప్రతీ అంశాన్ని తప్పనిసరిగా వీడియో చిత్రీకరణ చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, ప్రకటనలు ఇతరత్రా ప్రచారానికి సంబంధించి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని వివరించారు. వీటన్నింటినీ వీడియో చిత్రీకరించాలని తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్, బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారి రాహుల్, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల రిటర్నింగ్ అధికారి రాములు, చెన్నూర్ రిటర్నింగ్ అధికారి సిడాం దత్తు, ఏసీపీలు పాల్గొన్నారు.

మందమర్రిలో విప్ ఎన్నికల ప్రచారం

మందమర్రిరూరల్: ఎన్నికల్లో భాగంగా చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ మందమర్రి మార్కెట్ ఏరియాలో సోమవారం ప్రచారం నిర్వహించారు. 14 వార్డు పరిధిలోని మార్కెట్‌లోని ప్రతీ షాప్‌కు వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. మందమర్రి తన హయాంలోనే అభివృద్ధి చెందిందని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, ఇన్‌చార్జ్ శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్, నాయకులు సూరిబాబు, రాజశేఖర్, మాదవరెడ్డి, రాంవేణు, మద్ది శంకర్, రాంచందర్ తదితరులు ఉన్నారు.



వ్యాపారికి మేనిఫెస్టో పంచుతున్న బాల్క సుమన్

గౌడ కుటుంబాల మద్దతు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన 80 గౌడ కుటుంబాలు బీఆర్ఎస్ అభ్యర్థి, నియోజకవర్గ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈమేరకు తీర్మాన పత్రాన్ని బాల్క సుమన్‌కు అందించారు.

బీఎస్పీ బెల్లంపల్లి అభ్యర్థిగా జాడి నర్సయ్య



జాడి నర్సయ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లి బీఎస్పీ అభ్యర్థిగా జాడి నర్సయ్య ఖరారయ్యారు. నర్సయ్య పేరును బీఎస్పీ రాష్ట్ర చీఫ్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ సోమవారం ప్రకటించారు. నేతకాని సామాజికవర్గానికి చెందిన నర్సయ్య ఉట్కూర్‌లో జన్మించారు. నేతకాని సంఘంలో దశాబ్దంనరగా పని చేస్తున్నారు. సంఘ నిర్మాణంలో, నేతకాని సమస్యలపై పోరాడుతున్న నర్సయ్యను ప్రవీణ్‌కుమార్ బెల్లంపల్లి బరిలో నిలిపారు.

మంచిర్యాల అభ్యర్థిగా తోట శ్రీనివాస్..



తోట శ్రీనివాస్

నస్పూర్: బీఎస్పీ మంచిర్యాల అభ్యర్థిగా నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. 2009 నుంచి బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నస్పూర్ మున్సిపాలిటీ 13వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. బీఆర్ఎస్ సభ్యులు, స్వతంత్రుల మద్దతుతో వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. తాజాగా బీ ఎస్పీ మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించింది.

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

చెన్నూర్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మండలంలోని సుందరసాల గ్రామ సమీపంలో సరస్వతి బ్యారేజీ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును రిటర్నింగ్ అధికారి సిడాం దత్తు, తహసీల్దార్ మల్లికార్జున్‌తో కలిసి సోమవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు, కౌంటింగ్ వరకు పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. చెక్ పోస్టుల వద్ద మద్యం, నగదు రవాణాపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం చెన్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని డీసీపీ రామ్‌నాథ్ కేకన్, జైపూర్ ఏసీపీ మోహన్‌తో కలిసి పరిశీలించారు. కిష్టంపేట డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను తనిఖీ చేశారు. భద్రత కట్టుదిట్టంగా ఉంచాలని సూచించారు.



కిష్టంపేటలో స్ట్రాంగ్ రూంల వద్ద కలెక్టర్

ఘనంగా లయన్స్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల లయన్స్ క్లబ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో సోమవారం స్వర్ణోత్సవ సంబరాలు(గోల్డెన్ జూబ్లీ) ఘనంగా నిర్వహించారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నిత్య అన్నప్రసాద కార్యక్రమాన్ని లయన్స్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు ప్రారంభించారు. ప్రతీరోజు 200 మందికి ఉచిత భోజనం అందించనున్నట్లు సభ్యులు తెలిపారు. లయన్స్ జోనల్ చైర్‌పర్సన్ దేగబాపు ఆధ్వర్యంలో వేంపల్లికి చెందిన 24 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్స లయన్స్ బెల్లంపల్లి ఐ ఆసుపత్రిలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్‌పర్సన్ గోనె శ్యాంసుందర్‌రావు, మంచిర్యాల లయన్స్ అధ్యక్షుడు బాలాజీ, లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 జి గవర్నర్ హనుమాండ్ల రాజిరెడ్డి, ఎన్.వెంకటేశ్వర్‌రావు, సింహరాశి, కోదండరాం, ప్రోగ్రాం కన్వీనర్ వి.మధుసూదన్‌రెడ్డి, కె.సుగుణాకర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, సిరిపురం శ్రీనివాస్, వినయ్‌కుమార్, ఎం.రామాంజనేయులు, ఎస్.సూర్యనారాయణ, ఇరుకుల్ల ఆనంద్, గుండా శ్రీనివాస్, గోలి రాము, వీరస్వామి, దొంతుల ముఖేశ్, కొత్త సురేందర్, కె.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి శస్త్ర చికిత్స చేసుకున్న వారితో లయన్స్ సభ్యులు

మంచిర్యాలకు చేరిన రథయాత్ర

మంచిర్యాలఅర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీహనుమాన్‌దీక్షాపీఠం పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ పర్యవేక్షణలో చేపట్టిన కోటిశ్రీ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం రథయాత్ర సోమవారం మంచిర్యాలకు చేరింది. అన్నివర్గాలను భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో చేపట్టిన ప్రచారరథానికి స్థానిక ఐబీ చౌరస్తా ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రధాన రహదారి, పురవీధుల మీదుగా విశ్వనాథ ఆలయానికి యాత్ర చేరింది. అనంతరం దుర్గాప్రసాద్ స్వామిజీ విశ్వనాథస్వామి ఆలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామికి అభిషేకం చేశారు. హనుమాన్ చాలీసా పఠనం, ధార్మిక ప్రవచనం చేశారు. ఎమ్మెల్యే దివాకర్‌రావుతోపాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, భక్తులు పాల్గొన్నారు.



ప్రచార రథం వద్ద పీఠాధిపతి దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే

క్లుప్తంగా

రైలు ప్రమాదంలో యువకుడికి గాయాలు



సాయిని ఆసుపత్రికి తరలిస్తున్న యువకులు

తాండూర్: రైలు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. సోమవారం ఉదయం మండలంలోని బోయవాడకు చెందిన భోగి సాయి తాండూర్ బస్టాండ్ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌ను దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలైన సాయి ప్రాణాలతో ట్రాక్‌పై కొట్టుమిట్టాడుతూ ఉన్నాడు. గమనించిన యువకులు పోలీసులు, రైల్వే అధికారులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని ఆసుపత్రికి తరలించారు. గాయాలతో సాయి ట్రాక్‌పై పడి ఉండడంతో గూడ్స్ రైలు కొంతసేపు నిలిచిపోయింది. సాయి ప్రాణాలను కాపాడిన సంపత్, భీమేష్‌ను పలువురు అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెండోజోన్‌లో ఆదివారం రాత్రి పేకాటస్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.27,100 నగదును స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అదనపు ఎస్సై హరిశేఖర్, ఏఎస్సై మల్లేశ్, కానిస్టేబుల్ మహేశ్ ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

సిర్పూర్(టి): మండలంలోని ఆరెగూడ సమీపంలోని ఓ నీటికుంటలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పెద్దబండ గ్రామానికి చెందిన ఓ యువకుడు.. మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించాడు. కౌటాల సీఐ సాదిక్‌పాష, ఎస్సై డికొండ రమేశ్‌లు సోమవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు సేకరించగా అందాజ (35)ని గుర్తించారు. ప్రమాదవశాత్తు నీటికుంటలో జారి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

సింగరేణిలో ప్రచారం నిషేధం

మందమర్రిరూరల్: సింగరేణిగనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ఎన్నికల ప్రచారం నిషేధమని, ఉద్యోగులు ఎన్నికల ప్రచారానికి హాజరైతే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ సర్క్యులర్ ఆర్‌పీ/పీఈఆర్/ఐఆర్/డీ/98/1251 ప్రకారం సింగరేణి గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద పార్టీల అభ్యర్థులకు ప్రచారానికి అనుమతి లేదని వివరించారు.

పాటకు జై.. ప్రచారానికి సై

- ప్రత్యేక గీతాలతో హోరు
- పార్టీ, అభ్యర్థుల ప్రత్యేక పాటలు రికార్డింగ్
- ఓటర్లను ఆకర్షించేలా వ్యూహాలు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో రాజకీయ పార్టీల ప్రచారసందడి షురువైంది. గోడరాతలు పోస్టర్లు సభలు సమావేశాలకు తోడుగా ప్రత్యేక గీతాలతో పార్టీలు, అభ్యర్థుల గుణగణాలు, హామీలు, పథకాలు వంటి వాటితో ప్రత్యేక పాటలను రికార్డింగ్ చేయించారు. జనాల మధ్య పాటల్ని పెద్ద లౌడ్‌స్పీకర్లలో పెడుతున్నారు. విభిన్నమైన ప్రచార సాధనాలు వినియోగిస్తున్నారు. దసరా నవరాత్రులు పూర్తవడంతో క్రమంగా ప్రచారపర్వాన్ని ఉధృతం చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలతోపాటు ఆయా అభ్యర్థులు తమ పార్టీల పథకాలను గుర్తుతెచ్చేలా పాటలను ప్రత్యేకంగా కంపోజ్ చేయించి రికార్డు చేశారు. కాగా ఈ పాటల్ని డిజిటల్ విధానంలో లౌడ్‌స్పీకర్లలో ఆకట్టుకునే సంగీతంతో ప్రజలకు వినిపించేందుకు ప్రత్యేక వాహన ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్యకర్తల్లో జోష్

ఆయా రాజకీయ పార్టీలు డీజే సౌండ్ బాక్స్‌తో కూడిన ఆకట్టుకునే రీతిలో వినూత్నంగా సంగీతంతో కూడిన పాటలతో హోరెత్తిస్తున్నారు. ఎల్‌ఈడీ తెరలపై పార్టీ అభ్యర్థుల హామీలు, మేనిఫెస్టో, నేపథ్యం చాటిచిత్రాలు, వీడియోలతో బ్యాగ్రౌండ్‌లో పాటలను ఆసక్తి పెంచేలా తయారు చేస్తున్నారు.

గ్రామాల్లో ప్రచార సందడి

నవరాత్రోత్సవాలు పూర్తవడంతో ప్రచార పర్వం ఊపందుకుంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పరిధిలోని గ్రామాల్లో ప్రచారం మొదలైంది. డీజే సౌండ్‌బాక్స్‌లతో కూడిన అభ్యర్థులు, పార్టీలకు సంబంధించి ప్రచారహోరు ఎక్కడికక్కడ కనిపిస్తోంది. జిల్లాలో ప్రధానంగా మూడు పార్టీల అభ్యర్థులతో కూడిన ప్రచారం కనిపిస్తుంది. ఇప్పటికే నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఖరారు కొలిక్కి రావడంతో ప్రచార రథాలు సైతం రోడ్డెక్కాయి. మైక్‌సెట్, మాట్లాడేందుకు స్పీకర్లతో కూడిన సౌకర్యాలతో అవి సిద్ధమయ్యాయి. దీనికితోడు డ్రైవర్ మాత్రమే కలిగి ఉండే పార్టీ ప్రచారాన్ని సూచించే పాటలతో కూడిన వాహనాలను ఓటర్లను ఆకట్టుకునేలా తీర్చిదిద్ది గ్రామాల వెంట తిప్పుతున్నారు.



నృత్యాలతో అలరిస్తున్న కళాకారులు (ఫైల్)

ఇప్పటికే డీజేతో కూడిన ప్రత్యేక వాహనాల్లో పాటల సందడి మొదలైంది. పార్టీ కోసం అభ్యర్థి కోసం రాయించిన పాటలను వినిపిస్తూ ఓటర్లను ఆకట్టుకునేలా ప్రయత్నం చేస్తున్నారు.

అభ్యర్థి, పార్టీ..పాటలు ప్రత్యేకం

ఆయా పార్టీల అభ్యర్థులు ప్రత్యేకంగా తమ పేర్లతో కూడిన పాటలను రికార్డు చేయించుకున్నారు. తమ పేరు వచ్చేలా కనీసం మూడు నుంచి ఐదు పాటలు రాయించి ప్రత్యేక సంగీతంతో ఆకట్టుకునేలా రికార్డింగ్ చేయించారు. ఇక ఆయా పార్టీల అధిష్టానం ఇచ్చే పాటలు అదనం. ఇందులో సాహిత్యం మొత్తం పార్టీ, పథకాలను సూచించేవిధంగా ఉంటున్నాయి. ప్రత్యేకంగా వీటి కోసం దాదాపు 6 నుంచి 8 పాటలు సిద్ధం చేశారు. ఇక ఈ పాటలను ఎల్‌ఈడీ తెరలపై వీడియోలు జతచేస్తూ ముస్తాబు చేశారు. పాటల రచయిత, సంగీత దర్శకుడు, స్టూడియో, వాయిద్యాకారులు, గాయకులు వీడియో ఎడిటింగ్ కలిపి మొత్తం ఖర్చు చెల్లించాల్సి ఉంటుంది.

కళాజాత బృందాలు బిజీబిజీ

ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానంగా మూడు పార్టీల అభ్యర్థులు బరిలో ఉంటున్నారు. ఒక్కో పార్టీకి మూడు కళాజాత బృందాలు అవసరం ఉంటున్నాయి. నియోజకవర్గంలో ఒక బృందం అభ్యర్థి వెంట మిగతా రెండు బృందాలు ఇతర మండలాల్లో ప్రచారం నిర్వహించడానికి కార్యాచరణ చేస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకుంటూ ప్రవేశపెట్టిన పథకాలు, ఇచ్చే హామీలు ప్రజల్లోకి చేరువ చేసేందుకు కళాజాత బృందాలు శ్రమించనున్నాయి. స్థానిక భాషలో అర్థమయ్యేలా బృందాలు పాటలు, గాత్ర రూపంలో పనిచేయనున్నాయి. ఇందుకు జానపద కళాకారులు బృందాలను ఆయా పార్టీలు ముందస్తు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. రానున్న 30 రోజులపాటు ఉధృత ప్రచార హోరు కనిపించనుంది.

జంగ్ తెలంగాణ



పాటలు పాడుతున్న కళాకారుల బృందం సభ్యులు (ఫైల్)

రాత.. దాటొద్దు గీత



- సామాజిక మాధ్యమాలపై పోలీస్ శాఖ నిఘా
- ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లతో వాట్సాప్ గ్రూప్‌లు

నిర్మల్‌చైన్‌గేట్: అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రచార పర్వం వేడెక్కుతుంది. బరిలో ఉన్న నేతలు ఓటర్లను ఆకట్టుకునేందుకు సామాజిక మాధ్యమాలపై దృష్టిసారిస్తున్నారు. వాట్సాప్, ఎక్స్ ఖాతా, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్‌తోపాటు మరికొన్ని సోషల్ మీడియా వేదికగా చేసుకుంటున్నారు. జిల్లాలో పలువురు నేతలు ఇప్పటికే వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకోగా, పోస్టు చేసేందుకు యువకులు, బృందాలను నియమించుకుంటున్నారు. ఇక ఫేస్‌బుక్, ఎక్స్ ఖాతాను విద్యార్థులు, యువత ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఓటర్లకు చేరవేసేలా..

ఫేస్‌బుక్‌లో ఎమ్మెల్యేల అభ్యర్థులు, ఆశావాహుల అభ్యర్థుల పేర్ల మీద యువసేన పనిచేస్తోంది. ఇందులో యువతే అధికంగా ఉండడంతో ఆయా పార్టీలకు ఉపయోగపడనుంది. నియోజకవర్గాల వారీగా వాట్సాప్ ద్వారా తమ సందేశాన్ని తెలిపేందుకు యత్నిస్తున్నాయి. ఇందుకు ఓటర్ల సెల్‌ఫోన్ నంబర్లు అవసరం. వాటి సేకరణ బాధ్యత గ్రామాల పార్టీ శ్రేణుల నుంచి తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ముఖ్యంగా గ్రామాల బాధ్యులతో పార్టీ ప్రచార సందేశాన్ని ఓటర్లకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు.

వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా అధ్యయనం

బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఇప్పటికే ఖరారు కావడంతో ప్రచారం ఆరంభమైంది. నాయకుల అనుచరుల ప్రచారం, ఫొటోలు, వీడియోలను ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు. పార్టీలు ఇప్పటికే గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తున్నారు. ఇది కాకుండా నేరుగా ఎమ్మెల్యే అభ్యర్థిని చేరుస్తూ నియోజకవర్గ ముఖ్య నాయకుల గ్రూప్ ఒకటి ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. జిల్లాకేంద్రానికి సమీపంలోని నియోజకవర్గ తాజా, మాజీ ఎమ్మెల్యే గ్రామస్థాయిలో అసంతృప్తులు, ప్రజలేమనుకుంటున్నారు.. ఏం కోరుకుంటున్నారు..అనే విషయాలను గ్రామస్థాయి కార్యకర్తల వాట్సాప్ గ్రూప్ ద్వారా అధ్యయనం చేస్తున్నారు. దీన్ని ఆధారంగా చేసుకుని ప్రచారంలో వ్యూహాలు రూపొందిస్తున్నట్లు తెలిసింది. నాయకుల కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా వారి తరఫున సామాజిక మాధ్యమాల ఖాతాలను నిర్వహిస్తున్నారు. అందులో నాయకుల కటౌట్లతో ఫొటోలను తయారు చేసి ప్రచారం చేస్తున్నారు.

ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయవచ్చు

ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. క్షణాల్లో వదంతులు సృష్టించి వ్యాప్తిచేసే సోషల్ మీడియాపై నిఘా ఉంచారు. ఇష్టానుసారంగా పోస్టులు పెడుతూ శాంతియుత వాతావరణానికి భంగం కలిగించే వారిపై నిఘా పెట్టారు. ఇప్పటికే ఎన్నికల సంఘం సాంకేతికతను వినియోగించుకుంటోంది. అభ్యర్థులు ఎవరైన నియమావళి ఉల్లంఘిస్తే ఎవరైనా ఫొటోలు, వీడియోలు తీసి సంబంధిత అధికారికి ఫిర్యాదు చేయవచ్చు.

అవినీతి నిర్మూలనలో భాగస్వాములు కావాలి

మందమర్రిరూరల్: అవినీతి నిర్మూలనలో సింగరేణీయులు భాగస్వాములు కావాలని ఏరియా జీఎం మనోహర్ పిలుపునిచ్చారు. సింగరేణి విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ నవంబర్ 5 వరకు సింగరేణిలో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా అవినీతి నిర్మూలనకు ఉద్యోగులను చైతన్యపర్చి అవినీతి లేని సింగరేణిగా చూడాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. అనంతరం విజిలెన్స్ సమగ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, ఎస్టేట్ అధికారి కుమారస్వామి, ఎన్విరాన్‌మెంట్ అధికారి ప్రభాకర్, ఐటీ ప్రోగ్రామర్ రవి, డీవైపీఎం ఆసిఫ్, ఆఫీస్ ఉద్యోగాలు ఉన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం మనోహర్

జైపూర్: ఎస్టీపీపీలో సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. అడ్మిన్ భవన కార్యాలయంలో సమగ్రత ప్రతిజ్ఞ చేశారు. సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, జీఎం చిన్న బసివిరెడ్డి, వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏజీఎంలు ప్రసాద్, సుధాకర్, విజిలెన్స్ అధికారి రామబ్రహ్మం, వేణుగోపాల్, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రి పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



పట్టుబడిన బాటిళ్లతో నిందితుడు రమేశ్

బెల్లంపల్లి: బెల్ట్‌షాప్‌నకు అమ్మకానికి తీసుకెళ్తున్న మద్యం బాటిళ్లను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామానికి చెందిన అనవేని సంపత్ కాంటా ఏరియాలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న సంచిని తనిఖీ చేయగా 35 మద్యం బాటిళ్లు లభించగా స్వాధీనం చేసుకున్నారు.

కాంటాచౌరస్తాలో..

బెల్లంపల్లి మండలం సోమగూడెం గ్రామానికి చెందిన బానోతు రమేశ్ వద్ద కాంటాచౌరస్తాలో వన్‌టౌన్ పోలీసులు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇంటి వద్ద నిర్వహిస్తున్న బెల్ట్ షాపులో మద్యం బాటిళ్లను అమ్మడానికి తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. నిందితుడి వద్ద 20 మద్యం బాటిళ్లు లభించినట్లు ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

తాగిన మైకంలో హోంగార్డు వీరంగం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పీఎస్‌లో పనిచేస్తున్న హోంగార్డు తాగిన మైకంలో వీరంగం సృష్టించాడు. కాంగ్రెస్ ప్రచార రథం వాహనం సోమవారం హాజీపూర్ వీధుల్లో తిరుగుతూ మండల జాతీయ రహదారిపై చేరగా ఆపిన సదరు హోంగార్డు.. వాహన డ్రైవర్ మహేంద్రను దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నాడు. తాగిన మత్తులో హోంగార్డు చేస్తున్న హంగామాను స్థానికులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని స్టేషన్‌కు తీసుకెళ్లారు. దాదాపు 20 నిమిషాల పాటు హోంగార్డు వీరంగంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కాగా, ఎస్సై నరేశ్‌కుమార్‌ను ఈ విషయంపై వివరణ అడగగా హోంగార్డు మద్యం తాగి విధులు నిర్వర్తిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ఘటనపై సీఐ సంజీవ్‌కు సమాచారం అందించి అతని తిరిగి పంపించినట్లు తెలిపారు.

'ఆధార్' ఇక్కట్లు..



ఆధార్ కేంద్రం వద్ద ప్రజల క్యూ

మంచిర్యాలఅర్బన్: బోగస్ రేషన్‌కార్డులు తొలగించాలనే ఉద్దేశంతో చేపట్టిన రేషన్ ఈకేవైసీతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తెల్ల రేషన్‌కార్డులో పేర్లు ఉన్న కొందరు లబ్ధిదారులు వేలిముద్రలు రావట్లేదని ఆధార్ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. ఉదయం నుంచే బారులు తీరుతున్నారు. నిర్వాహకులు టోకెన్ నెంబర్లు ఇస్తూ బయోమెట్రిక్ అప్‌డేట్ చేస్తున్నారు. గంటల తరబడి అక్కడ వేచిచూడాల్సిన పరిస్థితి.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పదేళ్లకోసారి ఆధార్ కార్డు అప్‌డేట్, రేషన్ ఈ-కేవైసీ తప్పనిసరితో ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. జిల్లా వ్యాప్తంగా ఆధార్ నమోదు కేంద్రాల వద్ద నిత్యం పెద్ద సంఖ్యలో వచ్చే వారితో కిటకిటలాడుతున్నాయి. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల వివరాలు విద్యాశాఖ ఆధార్ అప్‌గ్రేడ్ చేసుకోవాలని సూచించింది. ఈ క్రమంలో ఆధార్ కేంద్రాలకు రద్దీ పెరుగుతోంది. కొన్ని కేంద్రాలు టోకెన్‌లు ఇస్తూ ఆధార్ నమోదు చేస్తోంది. టోకెన్‌లు లేని కేంద్రాల వద్ద పిల్లలు, పెద్దలు బారులు తీరుతునారు. ఉదయం 6 గంటల్లోనే కేంద్రాలకు చేరుకుని చెప్పులు వరుసలో పెట్టుకుంటున్నారు.



మంచిర్యాల ఆధార్ నమోదు కేంద్రం వద్ద వరుసలో ఉంచిన పాదరక్షలు

గోల్డ్‌మెడల్‌కు ఎంపిక



కాసిపేట: మండలంలోని దేవాపూర్‌కు చెందిన గడ్డం పురుషోత్తం కూతురు గడ్డం మేఘన ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీలో గోల్డ్ మెడల్‌కు ఎంపికైంది. 2021–22సంవత్సరానికి సంబంధించి యూనివర్సిటీ టాపర్, మహిళా విభాగంలో ప్రథమస్థానం పొందడంతో రెండు గోల్డ్‌మెడల్‌లు మేఘన కైవసం చేసుకుంది. మంగళవారం నిర్వహించే కన్వకేషన్‌లో అవార్డులు అందుకోనుంది.


అడవుల సంరక్షణకు పాటుపడాలి



వాచ్‌టవర్ ప్రారంభిస్తున్న ఎఫ్‌బీఓ

వేమనపల్లి(బెల్లంపల్లి): అడవుల సంరక్షణకు అటవీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని బెల్లంపల్లి ఎఫ్‌బీఓ వినయ్‌కుమార్‌సాహు అన్నారు. ఎఫ్‌ఆర్‌ఓ గోవింద్‌చంద్‌సర్దార్‌తో కలిసి సోమవారం వేమనపల్లి అటవీ సెక్షన్‌లోని కొత్తపల్లి బీట్ పరిధిలోకి వచ్చే అటవీ ప్రాంతంలో రూ.12లక్షలతో నిర్మించిన ఫైర్ వాచ్‌టవర్‌ను ఆయన ప్రారంభించారు. అడవుల్లో కార్చిచ్చులు ఏర్పడితే వాచ్‌టవర్ ద్వారా పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ లక్ష్మీనారాయణ, ఎఫ్‌ఎస్‌ఓలు రవికుమార్, మల్లయ్య, ఎఫ్‌బీఓలు పోచన్న, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఓట్.. నాట్ ఫర్ సేల్



నర్సాపూర్(జి): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున మండల కేంద్రానికి చెందిన యువకుడు ఎండీ జాబీర్ ఓ సందేశాన్ని తమ ఇంటి గోడపై రాయించాడు. 'ఈ ఇంటి ఓట్లు అమ్మబడవు 'ఓటు ఆయుధం దానిని మతం కోసమో! కులం కోసమో! డబ్బు కోసమే! వృథా చేయకండి..అని రాయించి ఓటర్లను ఆలోచించేలా చిన్న ప్రయత్నం చేశాడు.

తాళ్లపేటలో తొలి పోలింగ్ కేంద్రం



నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో మంచిర్యాల నియోజకర్గం ఏర్పాటైంది. దీని పరిధిలోకి దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్ మండలాలు వస్తాయి. నియోజకవర్గంలో మొత్తం 287 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇందులో తొలి పోలింగ్ కేంద్రం దండేపల్లి మండలం తాళ్లపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉంది. దీంతో నియోజకవర్గంలో దండేపల్లి మండలానికి ప్రత్యేక స్థానం ఉంది. – దండేపల్లి

రక్షణ సూత్రాలపై అవగాహన ఉండాలి



షీల్డ్ అందుకుంటున్న కేకే-5 గని మేనేజర్

మందమర్రిరూరల్: సింగరేణిలో ప్రతి ఉద్యోగి రక్షణ సూత్రాలపై అవగాహన ఉండాలని సేఫ్టీ కమిటీ కన్వీనర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. సింగరేణి 54వ రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం ఏరియాలోని కేకే–5 గనిని రక్షణ కమిటీ సందర్శించింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ప్రమాదాల సంఖ్య తగ్గాయన్నారు. రక్షణ పట్ల యాజమాన్యం ఎప్పటికప్పుడు ఉద్యోగులకు అధునిక పరి/జ్ఞానంతో కూడిన శిక్షణ అందిస్తోందన్నారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని సూచించారు. గనిలో అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు సమష్టిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడంతోనే ప్రమాదాల సంఖ్య తగ్గిందన్నారు. గతేడాది రక్షణ పక్షోత్సవాల్లో గెలుపొందగా బహుమతిగా షీల్డ్‌ను గని మేనేజర్ భూశంకరయ్య అందుకున్నారు. కమిటీ సభ్యులు (ఏజీఎం) కేహెచ్‌ఎన్ గుప్తా, ప్రవీణ్‌విక్రం, సాయినాథ్, శ్రీనివాసులు, ప్రదీప్‌కుమార్, శ్రీనివాసరావు, ఏజెంట్ రామదాసు, ఇంజినీర్ రాంప్రసాద్ ఉన్నారు.

ఓసీని సందర్శించిన రక్షణ కమిటీ

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఓసీని సోమవారం రక్షణ కమిటీ బృందం సందర్శించింది. ఏరియా జీఎం మనోహర్, బృందం కన్వీనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రక్షణ విషయంలో కార్మికులు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సంస్థకు బొగ్గు ఉత్పత్తి కన్నా కార్మికుల రక్షణే ముఖ్యమనేది గుర్తించాలన్నారు. సేఫ్టీ విషయంలో రాజీపడకుండా ప్రమాదాలు లేని గనిగా ఓసీని తీర్చిదిద్దాలని అన్నారు. అనంతరం రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.